తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## హంద్రీ-నీవా కాలువను పరిశీలించిన మంత్రి

శాంతిపురం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:



శాంతిపురం మండలం కుప్పం - పలమనేరు జాతీయ రహదారి వద్ద గుండిశెట్టిపల్లి మీదుగా వెళ్లే హంద్రీ-నీవా కాలువ పనులను సోమవారం రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. గుండిశెట్టిపల్లి మీదుగా పరమసముద్రం వరకు ఏమేర పనులు పూర్తయ్యాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసేందుకుచర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, అనసూయ, నాగరాజు, బాలు, రమేష్, బాలకృష్ణలు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర-2047 గోడపత్రికలు ఆవిష్కరణ



చిత్తూరు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త: స్వర్ణాంధ్ర-2047 గోడపత్రికలను కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా ప్రణాళిక అధికారి సాంబశివారెడ్డి, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వినాయకా... నీ లడ్డు పవిత్రమేనా ?

## -కాణిపాకం లడ్డూ తయారీపై భక్తుల అనుమానాలు





కాణిపాకం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:
అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిగా భక్తుల నీరాజనాలందుకునే శ్రీనివాసుడు కొలువైన తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారనే ఆరోపణల నేపథ్యంలో సత్య ప్రమాణాలకు కొలువైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో లడ్డూ తయారీపై కూడా భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుమల తర్వాత అతిపెద్ద ఆలయం కాణిపాకం ఆలయం. ఈ ఆలయ దర్శనార్థం ప్రతి రోజూ రాష్ట్రం నుండే కాకుండా దేశ నలు మూలల నుండి భక్తులు ప్రతి రోజూ సుమారు 20 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులు స్వామివారి లడ్డూ ప్రసాదంను పవిత్రంగా భావించి కొనుక్కొని ఇళ్ళకు తీసుకు వెళుతుంటారు. దీనితో దేవస్థానం పోటులో లడ్డూ, వడ ప్రసాదాలను తయారు చేస్తుంటారు. ఇందుకు కావలసిన సరుకులు దేవస్థానం ఈ టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తుంటుంది. ప్రతి ఏడాది టెండర్లు నిర్వహించి దేవస్థానంకు కావలసిన సరుకులు, నెయ్యిని కొనుగోలు చేస్తుంటుంది,. ఈమేరకు లడ్డూ, వడ ప్రసాదాలకు కావలసిన నెయ్యి, చక్కెర, జీడిపప్పు, ఏలకులు, ఎండు ద్రాక్ష, పచ్చ కర్పూరం, ఉద్దిపప్పు,బియ్యం వంటి వాటితో పాటు దేవస్థానం అవసరాలకు కావలసిన 80 రకాల సరుకులను టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తుంటారు. ఈఏడాది కా ంట్రాక్ట్ పొందిన తిరుపతికి చెందిన సుమతి ట్రేడర్స్ ద్వారా ప్రతి నెలా సుమారు 45 నుండి 50 లక్షల రూపాయల విలువగల సరుకులను కొనుగోలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుమతి ట్రేడర్స్ దేవస్థానంకు కిలో 550 రూపాయలు వంతున వైష్ణవి డెయిరీ నెయ్యిని సరఫరా చేస్తోంది. ఈమేరకు ప్రతి ఒకటిన్నర నెలకు 9 టన్నుల వంతున ఏడాదికి సుమారు 75 టన్నుల నెయ్యిని లడ్డూ ప్రసాదాల తయారీ కోసం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. నెయ్యి కాంట్రాక్ట్ పొందిన సుమతి ట్రేడర్స్ వారు నెయ్యి డబ్బాలను సరఫరా చేసే సమయంలోనే నెయ్యి నాణ్యతపై డెయిరీ వారి ఇచ్చే(ల్యాబ్ రిపోర్టులు) నివేదికలను దేవస్థానంకు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. దీనితో దేవస్థానం వారు కాంట్రాక్టర్ ఇచ్చే నాణ్యతా నివేదికలను పరిగణలోకి తీసుకుంటూ వస్తున్నారు. ఈనేపథ్యంలో తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం వివాదం దేశవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించడం, భక్తులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర దేవాలయాల్లో లడ్డూ తయారీపై కూడా భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా ఆలయాలు వాడుతున్న నెయ్యి నాణ్యమైనదేనా అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

దీనితో గత రెండు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ దేవస్థానం లడ్డూ పోటును, గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి లడ్డూ తయారీ, సరుకుల నాణ్యతను పరిశీలించారు. అలాగే నెయ్యి నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న గుంటూరులోని లేబరేటరీకి శాంపుల్స్ పంపి నివేదికలను తెప్పించాలని ఆదేశించడంతో ఆలయ అధికారులు ఆఘమేఘాలపై శాంపుల్స్‌ను లేబరేటరీకి పంపారు. ఈనివేదికలను తెప్పించి నెయ్యి నాణ్యతపై వున్న భక్తుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం దేవస్థానం అధికారులపై ఎంతైనా వుంది.

## నాణ్యత నెయ్యితో లడ్డూలు తయారీ

### -శాంతిహోమంతో దోష నివారణ : టిటిడి ఈఓ





సెప్టెంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవారి ఆలయంలో సర్వదోషాల నివారణకు వైఖానస ఆగమోక్తంగా సోమవారం ఉదయం శాంతిహోమం నిర్వహించామని టిటిడి ఈఓ జె.శ్యామలరావు చెప్పారు. ఇకనుండి లడ్డూప్రసాదాలు, నైవేద్యాలకు ఎలాంటి దోషాలు ఉండవని,భక్తులు సంతోషంగా స్వీకరించవచ్చని తెలిపారు..లడ్డూలకు కల్తీనెయ్యిలో భాగంగా జంతువుల కొవ్వునూనె వాడారనే భక్తుల్లో అపోహలు నెలకొనడంతో ,భక్తుల్లో విశ్వాసం పెంచడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో సోమవారం ఉదయం ఆలయంలో మహాశాంతి హోమం,పంచగవ్య ప్రోక్షణ చేపట్టామన్నారు. ఆలయంలోపల బంగారుబావిచెంత ఉన్న యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా శుద్ధి,శాంతి హోమాలను టిటిడి నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో టిటిడి పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, విఎస్‌ఓ ఎస్వీవి రామ్‌కుమార్,ప్రధాన అర్చకులు గోవిందరాజదీక్షితులు, కృష్ణశేషాచలదీక్షితులు, ఆగమసలహాదారులు రామకృష్ణదీక్షితులు, సీతారామదీక్షితులు,వేదపారాయణదారులు పాల్గొని పంచగవ్యప్రోక్షణ చేశారు.

## సూర్యప్రభవాహనంపై విహరించిన విఘ్ననాధుడు



కాణిపాకం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉభయదేవేరులతో కలసి విఘ్ననాధుడు సూర్యప్రభ వాహనంపై కాణిపాకం గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి సూర్యప్రభవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కీ॥శే॥శ్రీమతి రాజమ్మ 'అండ్ సి.రాజశేఖర్‌నాయుడు గార్ల కుమారులు, సి.ఇంద్రసేననాయుడు, సి.లక్ష్మీపతినాయుడు, బొమ్మసముద్రం వారు ఉభయదా రులుగా వ్యవహరించారు. రాత్రి అలంకార మండపంలో స్వామివారు ఉభయదేవేరులతో కలసి వేదపండి తులు మం త్రోచ్చారణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం వివిధ రకాల పరిమళ పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై అధిరోహించి భక్తులకు అభయహస్తం అందించారు. ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్,ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

### - పిఇఎస్ వైద్యకళాశాల డీన్ డా॥ కృష్ణారావు
### - మత్తు రహిత భారత్‌కై వైద్య విద్యార్థుల భారీ ర్యాలీ !!



కుప్పం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త
యువత సమాజంలో మత్తుకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం మత్తు రహిత భారత్ అభయాన్ (నషా ముక్త్ భారత్ అభయాన్) కార్యక్రమంలో భాగంగా పిఇఎస్ వైద్య కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థ వ్యసనాలను పరిష్కరించడంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు మత్తు పదారా ్ధలకు వ్యతిరేకంగా చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. సమాజాన్ని మత్తు రహితంగా మార్చేందుకు అందరి సహకారం అవసరమన్నారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు, ఆరోగ్య సమాజం కోసం విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా బ్యానర్లు, పోస్టర్లు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పిఇఎస్ కళాశాలకు చెందిన మూడు వందల మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

వెంకటగిరి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త



ఈ నెల 25,26 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎస్పి సుబ్బరాయుడు, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సందర్భంగా 25, 26 తేదీల్లో మద్య నిషేధం అమలు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు రద్దీ ఉండే ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం 300 రూపాయిలు, 100 రూపాయిలు, ఉచిత దర్శనం క్యూలైన్లు ఉంటాయని తెలిపారు. జిల్లా ఎస్పి సుబ్బరాయుడు మాట్లాడుతూ బాణసంచాను ప్రజలు లేని ప్రదేశాల్లో కాల్చాలని సూచించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు సామాన్య భక్తులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను మంత్రి రామ్ నారాయణ రెడ్డి సమర్పిస్తారని తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ రాఘవేందర్ మీనా, ఏఎస్పి రవి మనోహర్, డిఎస్పి రమణకుమార్, చైర్ పర్సన్ నక్క భానుప్రియ, ఎంపిపి తనుజ రెడ్డి, తహశీల్దార్ రాంబాబు, కమిషనర్ అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.
ఫోటో

# దేవునితో ఆటలా?

### 11కి పరిమితం చేసినా మారరా?
### మాజీ శాసనసభ్యులు, ఎస్‌సిని,సత్రవాడ



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 23 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రజలు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చరిత్రలో లేని విధంగా 151 సీట్లుతో పరిపాలించిన ఆయన్ను 11 సీట్లకు పరిమితం చేసినా మారరా? దేవునితో ఆటలా? అని మాజీ శాసనసభ్యులు ఎస్‌సివినాయుడు, సత్రవాడ మునిరామయ్యలు ధ్వజమెత్తారు. సోమవారం వారితో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో 'తిరుమల లడ్డు ప్రసాదాలకు సంబం ధించి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీరును' తీవ్రంగా ఖండించారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రజానాయకుడు అభివృద్ధి నిర్దేశకుడు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుపై అవాక్కులు, చెవాక్కులు పేలటం జనం తిట్టాలని పిలుపు నివ్వటం గమనిస్తే ఆయన శాడిజం అర్థమౌతుందన్నారు.ఒక్క ఛాన్సును కోరిన తండ్రి లేని బిడ్డ అని దయదలచిన జనానికి నిట్ట నిలువునా ముంచారన్నారు. 2019లో మార్పు కోరుకున్న జనం 151 సీట్లను ఇచ్చి పరిపాలించమంటే రాష్ట్రాన్ని రిజర్వ్ బ్యాంకుకు తాకట్టు పెట్టిన ఘనుడి పాలనంతా దుర్మార్గాలకు నిలయంగా మారిందన్నారు. మరో సారి అవకాశం కల్పిస్తే తమ ఇళ్ళలో మహిళలు కూడా మిగలరని భావించిన జనం ఊహాకందని తీర్పుతో 11 సీట్లకు పరిమితం చేసారన్నారు. తిరుమలేశుని లడ్డు విషయంలో ప్రపంచ దేశాల్లో జగన్మోహన్‌రెడ్డి ఫోటోలను తగుల బెడుతున్నారు. అయినా ఆయన తీరు మారదా? ప్రభుత్వాన్ని కేంద్రాన్ని బ్లాక్ మెయిల్ చేయటం తగదన్నారు.లడ్డుల తయారికి వాడిన నెయ్యికి సంబంధించి బిజెపి వాళ్ళు కూడా బోర్డులో ఉన్నారని జగన్మోహన్‌రెడ్డి మాట్లాడటం గమనిస్తే నెపం బిజెపి మీద తోసేటట్లుందన్నారు.

### ఎంత సంపాదిస్తే వీరి ధన దాహం తీరుతుంది?

మనిషి ఎంత అయినా సంపాదించవచ్చునని అయితే ఎంత సంపాదిస్తే టిటిడి ఇఓగా పని చేసిన ధర్మారెడ్డి, చైర్మెన్ కరుణాకర్‌రెడ్డి, టిటిడి పేరు తో నిధులు సాధించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల ధన దాహం తీరుతుందని మాజీ ఎంఎల్‌ఏలు ప్రశ్నించారు.టిటిడి లడ్డులకు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు భక్తి భావంతో ప్రసాదంగా తీసుకుంటారని అలాంటి ప్రసాదాల ఉనికిని ప్రశ్నార్థకం చేసిన జగన్ అండ్‌కో హైందవ సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు.టిటిడిని అడ్డంపెట్టుకునొ రూ.లక్షల కోట్లు సంపాదించిన వారికి ఎంత సంపాదిస్తే వారి ధన దాహం తీరుతుందని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ స్కిట్ చైర్మెన్ వంజవాకం గురుదశరథన్,మాజీ కౌన్సిలర్ ప్రసాద్‌నాయుడు,ప్రకాష్‌నాయుడు,మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు నారాయణయాదవ్,మల్లికార్జున్, సుదర్శనం నాయుడు, వెంకటకిషోర్,అంజూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవదేవుని ప్రసాదాల కలంకితంతో మనసు కలత



### -తప్పుచేయలేదని ఆలయం ముందు కరుణాకర్‌రెడ్డి ప్రమాణం
### -చివరగా అడ్డుకున్న పోలీసులు -అలిపిరి వద్ద ఉద్రిక్తత

తిరుమల,సెప్టెంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:
దేవదేవుడుకి ఆలయంలో తయారుచేసే అత్యంత పవిత్రమైన ప్రసాదాలు ,లడ్డు విషయంలో కళంకితమయ్యాయని కలుషిత రాజకీయ మనుష్యులు చేసిన వ్యాఖ్యలు తన మనసును కలచివేసిందని మాజీ టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఉద్వేగభరితంగా అన్నారు. వేంకటేశ్వరస్వామి ప్రియభక్తుడిగా,ఒక సేవకుడిగా టిటిడి బోర్డులో రెండు సార్లు ఛైర్మన్‌గా,మూడుసార్లుపాలకమండలి సభ్యుడుగా సేవలందించానని, తానుగానీ తప్పుచేసి ఉంటే నేను నాకుటుంబం సర్వనాశనం అయిపోవాలని చేతిలో కర్పూరహారతితో ప్రమాణం చేశారు. స్వామిచెంత సేవకుడిగానే తాను సేవలందించానని, సామాన్యభక్తులకే అదిక ప్రాధాన్యతనిచ్చానన్నారు. ఇటీవల లడ్డూప్రసాదాల తయారీలో నెయ్యికల్తీ జంతువుల కొవ్వునూనె వాడారనే వివాదంపై ఆయన సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. తొలుత స్వామివారి పుష్కరిణిలోకి దిగి స్నానమాచరించారు.తడిబట్టలతోనే ఆలయం ముందు వచ్చి శ్రీవారికి నమస్కరించారు. తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, కుమారుడు భూమన అభినయ్‌రెడ్డి,వైసిపి కార్యకర్తలతో కలసి వచ్చిన ఆయన అక్కడ నుండి అఖిలాండం వద్దకు చేరుకున్నారు. రాజకీయవ్యాఖ్యలు చేయడంతో తిరుమల డిఎస్పీ విజయశేఖర్, 1టౌన్ సిఐ విజయకుమార్, పోలీసులు, టిటిడి విజిలెన్స్ అధికారులు కరుణాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కొండ దిగి అలిపిరి గరుడవిగ్రహం వద్ద మీడియాతో మాట్లాడటానికి పోలీసులు అనుమతించలేదు. ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని, మాట్లాడటానికి వీల్లేదని పంపేశారు.అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. తీరా ఆయన అక్కడ నుండి ఇంటికెళ్ళిపోయారు.

## అర్థవంతమైన సమాధానంతో సమస్యల పరిష్కారం

### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించి ప్రజల నుండి అందిన అర్జీలకు అర్థవంతమైన సమాధానాలు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లతో కలిసి ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని త్వరితంగా పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కార ప్రగతిపై ప్రతి వారం సమీక్షించడం జరుగుతుందన్నారు. అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి గల కారణాలను వివరించాల్సి వుంటుందని కలెక్టర్ తెలిపారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమూర్.

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 240 అర్జీలు

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సమస్యలపై 240 అర్జీలు అందారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రతి అర్జీ సమగ్రంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో సమస్యను పక్కాగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 191 సమస్యలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మండల సర్వేయర్‌గా హరిబాబు

**.తొట్టంబేడు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** మండల సర్వేయర్‌గా హరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో సర్వేయర్ లేకపోవడంతో సచివాలయ సర్వేయర్‌లుకు బాధ్యతలు ఉండేవి. అయితే సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న హరి తొట్టంబేడు మండల సర్వేయర్‌గా బాధ్యతల స్వీకరించారు.

## దొంగ ప్రమాణాలు వద్దు కరుణాకర్‌రెడ్డి..



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** ప్రపంచంలోని హిందువులందరు ఎందరో భక్తిభావంతో కొలిచే కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల కొండలో వెలసిన వెంకటేశ్వరస్వామి ప్రసాదంలో కలసిన కల్తీ విషయంలో తన ప్రమేయం లేదని భూమనకరుణాకర్‌రెడ్డి చేస్తున్న దొంగ ప్రమాణాలను ఆపాలని తెలుగు దేశంపార్టీ బిసి విభాగం నాయకులు హెచ్చరించారు. ఈసందర్భంగా పలువురు బిసి నాయకులు మాట్లాడుతూ పవిత్ర తిరుమల కొండలో సాక్షాత్తు వెంకటేశ్వరస్వామి దివ్య ప్రసాదమైన లడ్డూను సాక్షాత్తు భగవత్సరూపంగా భావించే కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా లడ్డూల తయారీ కోసం జంతువుల కొవ్వును కలిపి నెయ్యిని సరఫరా చేసిన విషయంలో నాటి ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా నైతిక బాధ్యత వహించఆల్సిన భూమన కరుణాకర్‌రెడ్డి ఎదురుదాడి రాజకీయాలతో పవిత్రమైన తిరుమల క్షేత్రంలో ప్రమాణాల నాటకాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. తన నాస్తిక సిద్ధాంతాలతో ఒకనాడు వెంకటేశ్వరస్వామిని వారిని నల్లరాయిగానే చూసి దానిని చెప్పుతో కొట్టడం కాదన్నారు. ఒక్క తిరుమల తిరుపతి దేవస్థానం యొక్క సరుకుల సరఫరాలో జరిగిన కల్తీ విషయంపైనే కాకుండా రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని హిందూ దేవాలయాల్లో సరుకుల నాణ్యతను పరీక్షించడానికి సిఎం నారాచంద్రబాబునాయుడు చర్యలుతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మిన్నల్‌రవి, ఉమేష్‌రావు, నెమళ్ళూరుసుబ్రమణ్యం, కోటచంద్రశేఖర్, సునీల్, శివ, భాస్కర్, మణి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమరవాణాను అరికట్టండి



**.తొట్టంబేడు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** ఇసుక అక్రమరవాణాను అరికట్టాలని టుటౌన్ సిఐ వెంకటేశులును మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు కోరారు. సోమవారం సిఐను మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇసుకను సామాన్యులకు అందుబాటులో ఉంచేలా అక్రమంగా రవాణా చేసేవారు ఎవరైనా సరే అడ్డుకోవాలని సూచించారు. అలాగే రాబోయేది వర్షాకాలం కావడంతో మండలంలోని విరూపాక్షపురం, పెద్దకనపర్తి, పెన్నలపాడుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకోవాలని సిఐను కోరారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలువురు ఉద్యోగుల బదిలీలు:

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలువురు ఉద్యోగులకు సాధారణ బదిలీల్లో స్థాన చలనం కల్గింది. ఆలయానికి కొత్త ఇఇగా శ్రీశైలంలో పని చేస్తున్న ఇఇ మురళీధర్‌రెడ్డికి అవకాశం లభించింది. గతంలో ఎఇఇగా డిఇఇగా మురళీధర్‌రెడ్డి పని చేసారు. పనులపట్ల అవగాహన ఉన్న ఆయన మాస్టర్‌ప్లాన్ అమలుకు సంబంధించి యాక్టివ్‌గా పని చేస్తారని భావించి ఆయనకు అవకాశం కల్పించారు. ఇక ఇక్కడ పని చేస్తున్న ఎసి మల్లికార్జున్ ప్రసాద్‌ను ఎసి కడపకు బదిలి చేసారు. ఆయన స్థానంలో బుగ్గమఠం తిరుపతి నుంచి కస్తూరి బదిలి అయ్యారు. కస్తూరి గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఇఓగా కొంత కాలం పని చేసారు. ఇక్కడ పని చేస్తున్న ఇఇ నూకరత్నంను ద్వారకా తిరుమలకు బదిలి చేసారు. ఎఇఓ కాణిపాకంలో పని చేస్తున్న విద్యాసాగర్‌రెడ్డిను ఇక్కడకు బదలి చేసారు. శ్రీశైలంలో పని చేస్తున్న ఎఇఓ మల్లికార్జున్ రెడ్డి, కె.సాయికుమారి సూపరింటెండెంట్ శ్రీశైలం నుంచి శ్రీకాళహస్తికి, బి.మల్లికార్జునుడు సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం నుంచి బదిలి అయ్యారు. ఏ మునికుమార్ డ్రాఫ్ట్ మెన్ కాణిపాకం నుంచి శ్రీకాళహస్తికి మరో డ్రాఫ్ట్ మెన్ ఏ సర్వేశ్వరుడు శ్రీశైలం నుంచి ఇక్కడకు బదిలి అయ్యారు. ఇక్కడ నుంచి ఇద్దరు వెళ్ళగా 8 మంది బయటి ఆలయాల నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చారు. ఇఇ గా మురళీధర్‌రెడ్డి ఈ నెల 18న బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## కూనాటి సురేష్‌కు అభినందనలు



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** మండలంలోని ఊరందూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కూనాటి సురేష్ సోమవారం రాజధాని అమరావతిలోని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం విద్యాభవన్‌లో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు ఆహ్వానం మేరకు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్నందుకు సుబ్బారావు ప్రసంసించారు. విద్యాశాఖకు చేసిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని వీటిని ఇలాగే భవిష్యత్తులో కూడా కొనసాగించాలని సూచించారు.

## ఆక్రమణలకు చెక్ పెడుతాం-ప్రభుత్వభూముల్లో ట్రెంచ్‌ల ఏర్పాటు



**తొట్టంబేడు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలంలో ఆక్రమణలకు చెక్‌పెడుతామని ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడినా క్రిమనల్ కేసులు నమోద చేస్తామన్నారు. మండలంలోని సర్వేనంబర్ 52లో గతంలో 2.52 ఎకరాలు ఉండగా 0.80సెంట్లు భూమి ఆక్రమణలకు గురవడంతో సమాచారం అందుకున్న తహశీల్దార్ మధుసూధనరావు వెంటనే సర్వేయర్‌ను పంపి అక్కడ సమగ్ర సర్వేచేసి ఎవ్వరు ఆక్రమణలకు పాల్పడకుండా జెసిబితో ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. సచివాయ సర్వేయర్ రాఘవ, వినోద్‌లు పర్యవేక్షించారు. ఇక్కడ ఆక్రమణలకు బోర్డులు ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ తెలిపారు.

## పేరూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఏ.ఇ.గా నీలకంఠయ్య

**తిరుపతిరూరల్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ పేరూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఏ.ఇ.గా టి. నీలకంఠయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా రేణిగుంట విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏ.ఇ. విధులు నిర్వర్తిస్తున్న నీలకంఠయ్య బదిలీపై పేరూరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఏ.ఇ. నీలకంఠయ్య మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరాకు కృషి చేస్తామని తెలిపారు. పేరూరు విద్యుత్ సబ్ స్టేషన్‌గా బాధ్యతలు చేపట్టిన నీలకంఠయ్యకు పుదిపట్ల గ్రామ సర్పంచ్ బడి సుధాయాదవ్, టిడిపి సీనియర్ నాయకులు మల్లంగుంటకు చెందిన మునికృష్ణారెడ్డి, అవిలాల దిలీప్ యాదవ్ తదితరులు అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

**తిరుపతిరూరల్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 24 నుండి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్నదని తిరుపతిరూరల్ వ్యవసాయాధికారి మమత ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు సిబ్బంది పొలంబాట పట్టనున్నారని తెలిపారు. వారానికి రెండురోజులు పాటు ప్రతి మంగళ, బుధ వారాలలో రోజుకు 2గ్రామాల్లో సందర్శించనున్నారని తెలిపారు. అధికారులు పొలాలను సందర్శించి రైతులతో సమావేశమైతారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉదయం 8:30 గంటలకు వేమూరు గ్రామంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## అలసి సొలసిన కార్మికులకు "ఆయుష్మాన్ భారత్ వైద్య శిబిరం"

**చంద్రగిరి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** ఒక్కల కష్టంతో అలసి సొలసిన కార్మికుల సౌకర్యార్థం "ఆయుష్మాన్ భారత్" ఒక్క రోజు వైద్య శిబిరం నిర్వహించినట్లు బిజెపి రాష్ట్ర మాజీ కార్యదర్శి గాలి పుష్పలత తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ఏరియా ఆసుపత్రి) లో సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె ముందుగా వైద్య పరీక్షలు చేయించుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో నిత్యం పనుల వత్తిడితో గడిపే కార్మికులకు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా బిజెపి జిల్లా వెంకటముని కేంద్ర ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్రమణ్యం యాదవ్, తిలక్ యాదవ్, దొరస్వామి, నరేష్ కుమార్ నాయుడు, జమ్ముల అరుణ, వైద్య బృందం డాక్టర్ కవిత, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ ఛూష్మా, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రవీంద్ర నాథ్ ఠాగూర్, డాక్టర్ జీనత్, డాక్టర్ పావన్, డాక్టర్ కీర్తి, స్టాఫ్ నర్స్ జయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మా భూమిని రియల్టం ఆక్రమించాడు...న్యాయం చేయండి

**తిరుపతిరూరల్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** మా తండ్రిగారి పేరుపై ఉన్న భూమిని రియల్టర్ శేఖర్‌బాబు అనే వ్యక్తి ఆక్రమించాడు....న్యాయం చేయాలని తిరుపతి అర్బన్ తహశీల్ధార్ భాగ్యలక్ష్మిని చెంగమ్మ, మంగమ్మ, చంద్రమ్మ అనే మహిళలు వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం తిరుపతి అర్బన్ తహశీల్ధార్‌ను కలిసి ఫిర్యాదు చేసారు. తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నయగుంట లెక్కదాఖల సర్వేనెంబర్ 135/19,20,21, 22, సర్వే నెంబర్స్‌లో ఉన్న భూమిని తన తండ్రి ఎం.సంటయ్య పేరుపై పట్టా మంజూరై ఉందని తెలిపారు. తమకు చెందిన భూమినిలో శేఖర్‌బాబు 17-10-2022న జెసిబితో చదును చేస్తుండగా మాపై భౌతికదాడులు చేసారని ఆవేదన వ్యక్తం చేసారు. నకిలీ డాక్యుమెంట్స్ దౌర్జన్యాన్నికి పాల్పడుతున్న శేఖర్‌బాబు నుండి తన తండ్రికి చెందిన భూమిని తమకు దక్కెలా న్యాయం చేయాలని కోరారు.

## కె.సి.పేటలో అండర్ డ్రేనేజ్ పనులను పూర్తి చేయించండి

**తిరుపతిరూరల్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం కె.సి.పేట గ్రామ పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న అండర్ డ్రైనేజ్ పనులను పూర్తి చేయించాలని స్థానికులు తిరుపతిరూరల్ ఎంపిడిఓ రమేష్‌బాబును కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఓను కలిసి వినతి పత్రం అందజేసారు. కే.సి.పేట గ్రామ పంచాయతీలో అండర్ డ్రైనేజ్ కోసం రోడ్లన్ని తవ్వేసారని, ఇంకను అండర్ డ్రైనేజ్ పనులు పూర్తి చేయలేదని, రోడ్లు తవ్వడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ పినాకి పాణి ఆవేదన వ్యక్తం చేసారు. త్వరితగతిన అండర్ డ్రైనేజ్ పనులను పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అండర్ డ్రైనేజ్ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు

## నష్ట పరిహారం చెల్లించాలని అధికారులకు రైతు అభ్యర్థన



**రేణిగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ అవసరాల కోసం తన భూమిని తీసుకున్న ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని రేణిగుంట మండలం కొత్తపాళెంకు చెందిన రైతు వెంకట సుబ్బారెడ్డి అధికారులను అభ్యర్థించారు. 1968లో తండ్రి నుంచి తనకు సంక్రమించిన వ్యవసాయ భూమి నుంచి 2012వ సంవత్సరం 63 సెంట్లు భూమిని విమానాశ్రయ రన్‌వే విస్తరణలో భాగంగా తీసుకున్నారన్నారు. ఇంత వరకు నష్ట పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపాళెం గ్రామానికి చెందిన సర్వే నెం.140-ఏ ఎఫ్1లో తన తండ్రి ఆశేషారెడ్డికి 1968వ సంవత్సరం అప్పటి ప్రభుత్వం సాగు నిమిత్తం డీకేటీ పట్టా ఇచ్చిందన్నారు. అదే భూమిలో 2015వ సంవత్సరం రెండో సారి రన్‌వే విస్తరణకు 72 సెంట్లు భూమి ఇవ్వాలంటూ అధికారులు నోటీసు ఇవ్వడంతో ఆర్డీవోను ఆశ్రయించినట్లు తెలిపారు. ఇదిలా ఉంటే రాత్రి సమయంలో మా భూమి పక్కన సాగునీటికోసం ఉన్న చెరువు కట్టను తొలగించి విస్తరణ పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయాన్నిముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రిపవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం - కె.వి.రమణ



**రేణిగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** చైల్డ్ ఫోర్నో గ్రఫీపై మద్రాస్ హై కోర్టు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతూ సర్వోత్తమ న్యాయస్థానం(సుప్రీం కోర్టు) ఇచ్చిన తీర్పు హర్షనీయమని ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి.రమణ అన్నారు. చైల్డ్ ఫోర్న్ చూడడం, డౌన్‌లోడ్ చేయడం ఫోక్సో చట్టం ప్రకారం నేరమేనని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం అభినందనీయమన్నారు. చిన్న పిల్లల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న సంస్థలకు, కార్యకర్తలకు సుప్రీం కోర్టు తీర్పు ఊరటనిచ్చిందన్నారు. ఇలాంటి కఠినమైన నిర్ణయాలు తీర్పులు స్థానాలు ఇస్తే బాలికలపై జరుగుతున్న హింస, సామూహిక అత్యాచారాలు, అరికట్టడం సులభతరం అవుతుందన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**రేణిగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** భారత ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాల భాగంగా బీజేపీ నేతలు కరకంబాడి జడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. 100 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, ఇతర వస్తువులు అందజేశారు. మోదీ నాటి నాయకుడు దేశానికి ప్రధాని కావడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు తేజోవతి, బీజేపీ యువ నాయకులు వెంకటాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది మంచి ప్రభుత్వం



**కేవీబీ పురం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా కేవీబీ పురం మండలం వగత్తూరు గ్రామ పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సత్యవేడు కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డిలు పాల్గొని ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, జనసేన అధ్యక్షులు థామస్, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్, మధుయాదవ్, ప్రభాకర్, మాజీ సర్పంచ్ చెంగారెడ్డి, గోవిందరాజులు, నాధముని, చెంగ్రాయులు, పూజారి రమేష్, ఢిల్లీయ్య, సుబ్రహ్మణ్యం, మణిరాములు, కర్పూరంశెట్టి, శంకర్, దేశయ్య, యువతరైతులు, అభిమానులుపాల్గొన్నారు

## జోరుగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం



**విజయపురం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** మండలంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ నాయకులతో అధికారులు వంద రోజుల్లో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను పెంచిన పింఛన్ల కరపత్రాలను, స్టిక్కర్లను పంపిణీ చేశారు. మండలంలోని సామిరెడ్డి కండ్రిగ, శ్రీహరిపురం, మల్లారెడ్డి కండ్రిగ, నారపరాజు కండ్రిగ పంచాయతీల్లో నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబు, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు దశరథరాజు, నాయకులు రాఘవరాజు, చిన్నబ్బరాజు, సురేష్‌రాజు, ప్రకాష్‌యాదవ్, నరసింహులు యాదవ్, సుధాకర్ యాదవ్, భాస్కర్, నాధముని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జంబాడ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలు

**విజయపురం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** నేడు మంగళవారం ఉదయం 9 గంటలకు మండల స్థాయి క్రీడాపోటీలు జంబాడ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో హరిప్రసాద్‌వర్మ తెలిపారు. పాఠశాల ఆవరణలో కబడ్డీ, యోగా, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు పన్నూరు పీడీ గుర్రప్ప తెలిపారు.

## ఇంటి స్థలాల కోసం జాయింట్ కలెక్టర్‌ని కలసిన వెస్ట్ వరత్తూరు దళితులు

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ఇంటి స్థలాలు కోసం తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌ని తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో కలసి దళిత నాయకుల ఆధ్వర్యంలో సోమవారం వెస్ట్ వరత్తూరు గ్రామ దళితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రెసిడెంట్ గంట నరసింహులు, స్టేట్ సెక్రటరీ ధర్మయ్యలు మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వెస్ట్ వరవత్తూరు గ్రామంలో దళిత కుటుంబాలు ఇంటిస్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇంటి స్థలాల కోసం ప్రభుత్వ అధికారులకు విన్నవించగా గ్రామంలోని దళితవాడ సమీపంలోని సర్వే నెం.112/2లో ఐదు ఎకరాలు 92 సెంట్లు దళితల ఇంటి స్థలాల కోసం కేటాయించడం జరిగింది. ఇప్పటి వరకు దళితుల స్వాధీనంలోనే ఉంది. అయితే గ్రామంలోని అగ్ర కులాలకు చెందిన వారికి మూడు ఎకరాల శ్మశాన స్థలం, బాట సౌకర్యం ఉందని, శ్మశానం దూరంగా ఉందని ఉద్దేశంతో దళితులకు కేటాయించిన భూమిపై కన్నేసిన అగ్ర కులాల వారు మేము ఇక్కడ శ్మశాన ఏర్పాటు చేసుకుంటామని ఆక్రమణకు పాల్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని వారి దౌర్జన్యాలను అరికట్టాలని అధికారులను కోరారు. ఇంటిస్థలాలు లేని దళిత కుటుంబాలను గుర్తించి ఆ స్థలంలో దళితులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు రవి, ఎస్.దయాకర్, టి.నాగూర్, ఎస్.గురవయ్య, గ్రామ దళితులు పాల్గొన్నారు.

## 28న చంద్రగిరి గ్రామ పంచాయతీలో బహిరంగ వేలం

**చంద్రగిరి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** ఈ నెల 28న చంద్రగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఈఓ మహేశ్వరయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగిరి గ్రామ పంచాయతీలో వారపు సంత, ప్రైవేటు బస్టాండ్(ఆర్టీసి బస్సులు మినహా), జంతు వధశాల, దినసరి కూరగాయ మార్కెట్‌కు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024 అక్టోబర్ 1 నుండి 2025 మార్చి 31 వరకు 6 నెలల కాలానికి మాత్రమే ఈ బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందు కోసం వారపు సంతకు చెల్లించవలసిన ధరావత్తు రూ.4,50,000/-లు, ప్రైవేటు బస్టాండ్‌కు రూ.1,50,000/-లు, జంతు వధశాలకురూ.50,000/-లు, దినసరి కూరగాయల మార్కెట్‌కు రూ.40,000/-లు చెల్లించాలని కోరారు.

## శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా గిరి కుమార్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా బియస్ గిరికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ ఎం.రమేష్‌బాబు పీఠాపురానికి బదిలి అయ్యారు. గత నెల 30న ఆయన రిలీవ్ అయ్యారు. నెల రోజులుగా ఇన్‌చార్జి కమిషనర్ లలిత పాలన సాగుతుంది. ఈ నేపథ్యంలో వేయింటింగ్ లో ఉన్న బి.ఎస్.గిరికుమార్‌ను నియమించారు. గతంలో మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన గిరి కుమార్ గత కొంత కాలంగా డిఎంఎ కార్యాలయంలో ఉంటున్నారు. ప్రస్తుతం బదిలీల్లో గిరి కుమార్‌కు అవకాశం దక్కింది. అనుభవం ఉన్న గిరి కుమార్ త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్టోర్స్,వంటశాలలను ఎంఎల్‌ఏ తనిఖీ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికారులతో కలసి స్టోర్స్, వంటశాల, అన్నదానంలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆయనతో పాటు డెప్యూటీ ఇవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఉన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సరఫరా చేస్తున్న నేతికి సంబంధించిన నాసి రకం నెయ్యి సరఫరా అనే వార్తలు ప్రచరించతం కావటంతో స్పందించిన ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఇక్కడ స్టాక్‌లో ఉన్న వైష్ణవి నేతి డబ్బాలను పరిశీలించారు. దానిపై లేబుల్స్‌ను పరిశీలించారు. ఇక నిత్యాన్నదాన పథకంలో ఉపయోగించే కందిపప్పు, శెనగపప్పు, లడ్డుల తయారికి ఉపయోగించే శెనగపిండి, జీడిపప్పు, ద్రాక్షలతో పాటు ప్రసాదాలకు ఉపయోగిస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఎఇఓ లోకేష్‌రెడ్డి, హేమమాలిని, స్టోర్స్ ఇన్‌చార్జి షణ్ముగం, వంటశాల ఇన్‌చార్జి నాగభూషణం నాయక్, తెలుగుదేశం నాయకులు జడ్‌పిటిసి వవెంకటసుబ్బారెడ్డి, మార్కెటింగ్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, బత్తిరెడ్డి, కన్నలి ప్రతాప్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, లక్కమనేని మధుసూధననాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇది మంచి ప్రభుత్వం ఎమ్మెల్యే

ఏర్పేడు, సెప్టంబరు23, ప్రభాతవార్త;



కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులు పాలన సందర్భంగా మండలంలోని దర్గిపేరి గ్రామ నందు సోమవారం ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక సభకు ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొని సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం పేదలను సంపన్నులను చేయడమే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రెడ్డివారి గురవారెడ్డి, నైనారు పొన్నారావు, పేరం ధనంజయులు నాయుడు, రాచేటి సుబ్రమణ్యం, కృష్ణవేణి, హంస, తహసిల్దార్ భార్గవి, ఆర్ఐ నల్లయ్య, మురగయ్య, కృష్ణప్ప మొదలి తదితర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ట్రాన్స్‌కో డిఇగా దేవ ఆశీర్వాదం



**పుత్తూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** ట్రాన్స్‌కో పుత్తూరు డిఇగా ఎన్. దేవఆశీర్వాదం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు డివిజన్‌లో ప్రజలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే వినియోగదారుల విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డివిజన్ పరిధిలోని పలువురు ఉద్యోగులు డిఇని కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## ఎన్ సి సి ప్రవేశాల ఎంపిక -బి సర్టిఫికెట్ల ప్రదానం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:**



శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తిరుపతిలో 5 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అనూజ్ వాద్వా పర్యవేక్షణలో వివిధ విభాగాల వారీగా పరీక్షలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన 31 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ మాట్లాడుతూ ఎన్‌సిసిలో బి,సి సర్టిఫికెట్లను పొందడం ద్వారా పైచదువులు చదువుకోవడానికి, ఉద్యోగ అవకాశాలు పొందే ప్రక్రియలో కూడా ఉపయోగపడుతుందని విద్యార్థినులకు తెలిపారు. ప్రిన్సిపల్, కల్నల్ అనూజ్ వాద్వా బి సర్టిఫికెట్లను విద్యార్థినులకు అందజేశారు. ఢిల్లిలో ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపు 2023 కు ఎంపికైన ముగ్గురు ఎన్ సి సి క్యాడెట్స్ డి.అనుష, ఎన్ సాయి గోపిక, వి శిరీష లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆల్ ఇండియా తల సైనిక్ క్యాంపు 2024 లో ఎంపికైన పి.భాగ్య శ్రీ అను ఎన్ సి సి క్యాడెట్ సీనియర్ విభాగం నందు మొదటి స్థానంలోనూ, అలాగే ఆల్ ఇండియా లెవెల్ లో రెండవ స్థానంలో నిలిచినందుకు కల్నల్, ప్రిన్సిపల్ తనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి సి సిటిఓ అధికారిని సిహెచ్ సుహాసిని, మాజీ ఏఎన్ఓ ఎం హేమలత, డాక్టర్ వరప్రసున, నాయక్ సుబేదార్ కైలాష్ కుమార్, అవల్దార్ యు వెంకటేష్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రఘురామరాజు దిష్టిబొమ్మ దహనం



**నగరి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ మండలం ఉండి నియోజకవర్గం ఏలూరుపాడు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవమానపరచిన తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేయాలని నగరి అంబేద్కర్ సర్కిల్‌లో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేశారు. ఇలాంటి నాయకులను ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని తెలిపారు. దళితులకు న్యాయం వేరే కులాలకు ఒక న్యాయం అన్నట్టు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, ఇదే దళితులైతే వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని, వేరే నాయకులైతే పట్టించుకోనా దళితుల మీద చూపుతున్న ప్రేమ ఇదేనా నిజంగా చిత్తశుద్ధి ఉంటే రఘురామకృష్ణంరాజుని పార్టీ నుంచి సస్పెండ్ చేసి దసరా తన శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వేలాయుధం, నగరి మండల గౌరవ అధ్యక్షులు బలవర్ధనరాజు, అధ్యక్షులు విజయకుమార్, జనరల్ సెక్రటరీ తంగరాజు, కార్యదర్శి యోవాన్, ఉపాధ్యక్షులు బాబు, ఉమాపతి, ఉప కార్యదర్శులు గోవిందస్వామి, హరి, వెంకటేశులు, న్యాయవాదులు బాబు, నాగరాజు, సందీప్, బీఎస్పీ నాయకులు గజేంద్ర, నాగూర్, కమిటీ సభ్యులు జబరాజు, రజని, శశి, నాగరాజు, చిన్నరాజా, బాషా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే



**నగరి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా నగరి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత బాగుం డాలి, ఆ పరిశుభ్రత చేసే శానిటరీ కార్మికులు, కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటేనే అది సాధ్యమవు తుందన్నారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్యులు రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## నగరిలో మున్సిపాలిటీలో గ్రామసభ

**నగరి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:**



పొలం పిలుస్తోంది గ్రామసభలు మంగళ, బుధవారాల్లో నిర్వహించడం జరుగుతుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా నగరి మున్సిపాలిటీ పుదుపేటలో జరిగిన పొలం పిలుస్తోంది గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే సాంకేతిక సలహాలు, సూచనలు, రాబోయే రబీ సీజన్ రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసే విధంగా ప్రభుత్వం వారు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి, పుదుపేట గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## ఆట వస్తువుల వితరణ

**వడమాలపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** వడమాలపేట మండలంలోని ఎస్వీ పురం ప్రాథమికోన్నత పాఠశాల 20,000లు విలువచేసే ఆట వస్తువులను దాతలు విరాళంగా ఇచ్చారు. ఎస్వీ పురం గ్రామానికి చెందిన తులసిరామ్ తన తల్లి గోవిందమ్మ చేతుల మీదుగా ఆట వస్తువులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాశంకు అందజేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు రంగయ్య, నరసింహారెడ్డి, సుదర్శన్‌రాజు, గ్రామస్తులు వెంకమరాజు, చిరంజీవి, టి.వి.రాజు పాల్గొన్నారు.

## నేటి నుంచి పొలం పిలుస్తుంది గ్రామ సభలు

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది గ్రామసభలు మంగళ, బుధవారాల్లో నిర్వహించడం జరుగుతుందని అధ్యక్షుడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్‌నాయుడు, వ్యవసాయ అధికారి భారతిలు తెలియజేశారు. 24వ తేదీ మంగళవారం పుత్తూరు, ఆలత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ¬కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## శానిటేషన్ కార్మికులకు రక్త ఆరోగ్య పరీక్షలు

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ప్రధాని మంత్రి మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ కార్మికులకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు ఎంపీడీవో త్రివిక్రమరావు, ఆరోగ్య అధికారి డి.ఎన్.వెంకటేశ్వరులు పరిరక్షణలో నిర్వహించారు. ఆరోగ్య అధికారి వెంకటేశ్వరులు మాట్లాడుతూ దేశ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత బాగుండాలి, ఆ పరిశుభ్రత చేసే శానిటరీ కార్మికులు, కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటేనే అది సాధ్యమవుతుందన్నారు. కాబట్టి వారందరూ వారి ఆరోగ్య పరిస్థితులను పరీక్ష చేసుకుని డాక్టర్ సలహాలతో ఆరోగ్యాన్ని పాటించాలన్నారు. పనిచేసేటప్పుడు విధిగా చెప్పులు ధరించి ముళ్ళు, సీసా పెంకులు, చీలలు మున్నగ వాటి నుంచిరక్షణ పొందాలన్నారు. ఎంపీడీవో త్రివిక్రమరావు, పంచాయతీ సెక్రటరీలు, ల్యాబ్ టెక్నీషియన్ అనూష పాల్గొన్నారు.

## గ్రీన్ అంబాసిడర్ కార్మికులు పెండింగ్ బిల్లులను చెల్లించాలి - ఏఐటీయూసీ



**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** మం డలంలోని పంచాయతీలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులను వెంటనే బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కత్తి ధర్మయ్య ఎంపీడీవో త్రివిక్రమరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడుపుకోవడం చాలా కష్టంగా ఉందని గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీనాయకులు టి.నాగార్జున, గ్రీన్ అంబాసిడర్ నాయకులు మునీంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

## నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం



**రేణిగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి బీజేపీ నాయకులు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. తమ స్వగ్రామం నగరిపల్లికి వెళ్ళడానికి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో డీసీసీబీ మాజీ అధ్యక్షులు అమాస రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు నవీన్ కుమార్‌రెడ్డి, పీలేరు నాయకులు మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చిన్న, వాసు, బుజ్జి, మహేష్, శ్రీరాములు, పార్థసారథి, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరిపల్లి బయలుదేరి వెళ్లారు. సోమవారం నుంచి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కలికిరిలో అందుబాటులో ఉంటారు.

